సాక్షి
బాపట్ల

మంగళవారం । 22 । అక్టోబర్ । 2024



మెడికల్ కళాశాలకు 'పింగళి' పేరు

మచిలీపట్నం: మచిలీపట్నం మెడికల్ కళాశాలకు జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య పేరును పెడుతూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం జీఓ నంబర్ 132 విడుదల చేసింది.



యార్డుకు 28,668 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 28,668 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 26,408 అమ్మకాలు జరిగాయి.

విగ్రహాల ప్రతిష్ట



కర్లపాలెం: గ్రామదేవత పోలేరమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట సోమవారం నక్కలవానిపాలెంలో అత్యంత వైభవంగా జరిగింది. ఆలయం బయట పోతురాజుస్వామి విగ్రహాన్ని ప్రతిష్టించారు.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీలు తొలగింపు



బాపట్ల: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ మేరుగ నాగార్జున ప్రమాణస్వీకారానికి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల తొలగింపులో మున్సిపల్ అధికారులు అత్యుత్సాహం చూపారు. ఒకపక్కన అధికార పార్టీ నాయకుల ఫ్లెక్సీలు పట్టణంలో నెలలకొద్దీ ఎక్కడపడితే అక్కడ ఉన్నప్పటికీ వాటి వైపు కన్నెత్తి చూడని అధికారులు వైఎస్సార్ సీపీ నాయకులు ఏర్పాటు చేసిన రోజే ఫ్లెక్సీలు, బోర్డులు తొలగించటంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

డీఎస్సీ ఉచిత శిక్షణ దరఖాస్తు గడువు పొడిగింపు

నెహ్రూనగర్: జిల్లాలో ప్రతిభావంతులైన పేద ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో డీఎస్సీ పరీక్షకు ఉచిత శిక్షణ నమోదు గడువును ఈ నెల 21 నుంచి 25 వరకు పొడిగించినట్లు ఎస్సీ వెల్ఫేర్ డీడీ మధుసూదనరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెట్ ఉత్తీర్ణులైన వారికి నవంబర్ 3న స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించి ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. అర్హులైన వారు జ్ఞానభూమి పోర్టల్‌లో సంబంధిత ధ్రువపత్రాలతో ఈ నెల 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రకాశం బ్యారేజ్ దిగువకు నీటి విడుదల



తాడేపల్లి రూరల్: ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు రావడంతో ఇరిగేషన్ శాఖ అధికారులు సోమవారం సాయంత్రం ప్రకాశం బ్యారేజ్ గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా జేఈ రాజేష్ మాట్లాడుతూ ఎగువ పులిచింతల ప్రాజెక్ట్, ఇతర వాగుల నుంచి 2,28,532 క్యూసెక్కుల వరద నీరు ప్రకాశం బ్యారేజ్‌కు వచ్చి చేరిందని తెలిపారు. బ్యారేజీ రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా, 70 గేట్లు ఐదు అడుగులు ఎత్తి దిగువకు 2,20,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని చెప్పారు. దీంతోపాటు తూర్పు డెల్టా కాలువకు 5513 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 2519 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

25లోగా దరఖాస్తుల స్వీకరణ

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): నవంబర్ 11వ తేదీన మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని అబుల్ కలాం ఆజాద్ జాతీయ స్థాయి పురస్కారంతోపాటు డాక్టర్ అబ్దుల్ హఖ్ ప్రాంతీయ స్థాయి పురస్కారాలకు ఉమ్మడి జిల్లాల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి షరీఫ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉర్దూ అకాడమీ ద్వారా జారీ చేసిన దరఖాస్తు ఫారాలు పూర్తి చేసి ఈనెల 25వ తేదీలోగా డాక్టర్ మహమ్మద్ ముస్తాక్, డైరెక్టర్, సెక్రటరీ, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఉర్దూ అకాడమీ మలావికా విల్లా, హెచ్.బి కాలనీ భవానీపురం, విజయవాడ చిరునామాకు స్వయంగా లేదా పోస్టు, కొరియర్ ద్వారా పంపించాలని సూచించారు. పురస్కారాలకు గుంటూరు, పల్నాడు, బాపట్ల, జిల్లాల నుంచి ఉపాధ్యాయులు విద్యార్థుల పేర్లు ప్రతిపాదనలు పంపించాలని తెలిపారు.

మహిళతో జనసేన నేత అసభ్య ప్రవర్తన

పట్నంబజారు: నగరంలోని పాత గుంటూరుకు చెందిన ఒక జనసేన నాయకుడు మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన సంఘటన చోటుచేసుకుంది. విశ్వసనీయ సమాచారం మేరకు.. పాత గుంటూరుకు చెందిన జనసేన పార్టీకి చెందిన ఓ డివిజన్ అధ్యక్షుడు మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించినట్లు తెలుస్తోంది. అయితే సదరు మహిళ, స్థానికులు అతడికి దేహశుద్ధి చేసినట్లు చెబుతున్నారు. ఈ అంశం సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీనిపై పాత గుంటూరు పోలీసులు వివరణ కోరగా... గొడవ జరిగిన మాట వాస్తవమేనని, అయితే ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ప్రజలను నట్టేట ముంచిన బాబు

- జనంలోకి రావాలంటేనే చంద్రబాబుకు వణుకు పుడుతోంది
- వైఎస్సార్ సీపీకి బాధ్యత మరింత పెరిగింది
- వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందాం
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ మేరుగ నాగార్జున ప్రమాణస్వీకారం



సభలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మేరుగ నాగార్జున

సాక్షి ప్రతినిధి, బాపట్ల, బాపట్ల: ప్రజలను నట్టేటా ముంచిన తెలుగుదేశం పార్టీ తీరును ఎండగట్టేందుకు నాయకులు,కార్యకర్తలు సిద్ధంగా ఉండాలంటూ వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మేరుగ నాగార్జున పేర్కొన్నారు. బాపట్ల జిల్లా అధ్యక్షుడిగా సోమవారం స్థానిక ఎమ్మెస్సార్ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన బాధ్యతలు చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ టీడీపీ రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన కొనసాగిస్తుందన్నారు. హత్యలు, దాడులు రోజు రోజుకు పెరిగిపోతున్నాయని మేరుగ ధ్వజమెత్తారు. ఎన్నికల హామీల్లో కనీసం ఒక్కటి కూడా పరిష్కరించలేని చంద్రబాబునాయుడు ప్రజల్లోకి రావాలంటేనే భయపడుతున్నారని ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీకి మరింత బాధ్యత పెరిగిందని, నాయకులు కార్యకర్తలకు అండగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రజలందరు తిరిగి వైఎస్సార్ సీపీని అధికారంలోకి తెచ్చుకోవాలనే బలమైన సంకల్పంతో ఉన్నారని, అందరం కలిసికట్టుగా తిరిగి అధికారంలోకి వచ్చేందుకు శక్తి వంచనలేకుండా కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాదె మధుసూదనరెడ్డి, బత్తుల బ్రహ్మానందరెడ్డి, కె.కనకారావు మాదిగ, నాయకులు పాల్గొన్నారు.

పోరాటాలు కొత్తేమి కాదు

పోరాటాలు వైఎస్సార్ సీపీకి కొత్తేమికాదు. ప్రజా వ్యతిరేకవిధానాలను అడ్డుకునేందుకు వైఎస్సార్ సీపీ బలంగా ఉంది. కార్యకర్తలకు అండగా ఉంటాం.

– పానెం చిన హనిమిరెడ్డి, అద్దంకి ఇన్‌చార్జి



మేరుగ నాగార్జున, కారుమూరి, బూచేపల్లి వెంకాయమ్మలను గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం

జగన్ మళ్లీ సీఎం కావడం తథ్యం

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నివర్గాలకు మంచిచేస్తే చంద్రబాబు ప్రభుత్వం పార్టీలు, కులాలు అంటూ వివక్షతో పరిపాలన సాగిస్తోందని, వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావడం తథ్యమని వైఎస్సార్ సీపీ ఉమ్మడి ప్రకాశం జిల్లా సమన్వయకర్త, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. ప్రతికార్యకర్తను వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తన గుండెల్లో పెట్టుకున్నాడన్నారు. రెండు సంవత్సరాలు కరోనా కష్టాల్లోనూ ఏ ఒక్క పథకాన్ని ఆపలేదన్నారు. చంద్రబాబు పాలనలో రాష్ట్రం జీరోకు పడిపోయిందన్నారు.

స్కాముల్లో చంద్రబాబు దిట్ట..



సూపర్‌స్కిల్డ్ స్కాములు చేయడంలో సీఎం చంద్రబాబు దిట్టఅని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామల పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 140 రోజులు అవుతున్నా సూపర్‌సిక్స్‌లో ఒక్కహామీని నెరవేర్చలేదన్నారు. ఈ రాష్ట్రంలో మహిళలకు భద్రత ఉందా? అని శ్యామల ప్రశ్నించారు. ప్రజలకు వరద సహాయమూ అందించలేదన్నారు. కోవిడ్ టైంలోనూ వైఎస్ జగన్ అన్నివర్గాలకు సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందించారన్నారు. మళ్లీ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగిరే వరకు, వైఎస్ జగన్ సీఎం అయ్యేవరకు పార్టీకి తోడుగా ఉంటామని శ్యామల కార్యకర్తలతో ప్రమాణం చేయించారు.

ఒక్క అడుగు వెనక్కి వేస్తే ఓడినట్లు కాదు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రేపల్లె నియోజకవర్గంలో 23మందిపై దాడులు చేసి, ఒకరిని చంపారు. సింహం ఒక్కఅడుగు వెనక్కి వేస్తే ఓడినట్లు కాదు. రెట్టించిన ఉత్సాహంతో మూడు అడుగులు ముందుకు వేస్తోందని గుర్తుంచుకోవాలి.

– ఈవూరి గణేష్, రేపల్లె ఇన్‌చార్జి


కేసులతో భయపెట్టాలని చూస్తున్నారు



కేసులు పెట్టి నాయకులు, కార్యకర్తలను భయపెట్టాలని చూస్తున్నారు. మా కార్యకర్తలపై కేసులు పెడితే ఏ1గా నా పేరు పెట్టండి. రాష్ట్రంలో ఏకపక్షంగా పాలన సాగుతోంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు కలిసికట్టుగా పోరాడుదాం.

– వరికూటి అశోక్‌బాబు, వేమూరు ఇన్‌చార్జి

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం



ప్రతి కార్యకర్తలకు అండగా ఉంటాం. దాడులకు పాల్పడే టీడీపీ నాయకులు ప్రజాకోర్టులో త్వరలో మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. జమిలి ఎన్నికలకు అందరు సిద్ధంగా ఉండాలి.

– బూచేపల్లి శివప్రసాదరెడ్డి, ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ ప్రకాశం జిల్లా అధ్యక్షుడు

కలిసి పని చేస్తే విజయం మనదే



కలిసి పని చేస్తే విజయం మనదే. ప్రజల్లో ఉన్న బలాన్ని గుర్తుంచుకోవాలి. కూటమి నేతలు సూపర్‌సిక్స్‌లో కనీసం ఒక్క సిక్స్ కూడా కొట్టలేకపోయారు. పార్టీకోసం కష్టపడి పని చేయాలి.

– మాధవరావు, ఎమ్మెల్సీ

ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి..



ప్రజలను మభ్యపెట్టి టీడీపీ అధికారంలోకి వచ్చింది. రాష్ట్రంలో వైఎస్సార్ పాలనకు మించి ప్రజల హృదయాలను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలుచుకున్నారు. అధికారంలో లేకున్నా ప్రజల్లో ఉంటున్న ఏకైక నాయకుడు వైఎస్ జగన్‌మాత్రమే.

– లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్సీ

దాడులు కాదు ప్రజాసేవ చేయాలి..



సంక్షేమ పథకాలు అమలు చేయటంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే పైచేయి. కరోనా వంటి విపత్తులో కూడా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించిన ఘనత దక్కింది. దాడులు కాదు, ప్రజలకు సేవ చేయటం టీడీపీ నేర్చుకోవాలి.

– బూచేపల్లి వెంకాయమ్మ, ప్రకాశం జెడ్పీ చైర్‌పర్సన్

జమిలి ఎన్నికలకు సిద్ధంగా ఉండండి



వైఎస్సార్ సీపీ నాయకులపై కేసులు పెట్టి బెదిరించాలని చూస్తున్నారు. కేసులకు భయపడే రోజులు పోయాయి. నాయకులు, కార్యకర్తలు జమిలి ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి.

– కోన రఘుపతి, మాజీ డిప్యూటీ స్పీకర్

కష్టపడిన ప్రతి ఒక్కరికీ మంచి భవిష్యత్



పార్టీ కోసం కష్టపడి పని చేసిన ప్రతి ఒక్కరికీ మంచి భవిష్యత్ ఉంటుంది. పార్టీ పరంగా అందరం కలిసి పోరాటాలు చేద్దాం. నష్టపోయిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం.

– కరణం వెంకటేష్, వైఎస్సార్ సీపీ చీరాల ఇన్‌చార్జి



పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం బాపట్ల పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన పోలీసు అమరవీరుల స్థూపం వద్ద జిల్లా ఎస్పీ తుషార్ డూడీ పుష్ప గుచ్ఛం ఉంచి ఘన నివాళులర్పించారు. – బాపట్ల

మార్కెట్‌లో విజిలెన్స్ తనిఖీలు

- సాక్షి కథనంపై అధికారుల్లో కదలిక
- సీలు వేయని కాటాలు, తెల్ల కాగితాలే బిల్లులు
- 8% కమీషన్ తీసుకుంటున్నారని రైతులు వెల్లడి
- విలేకరులపై వ్యాపారుల దౌర్జన్యం
- విస్మయం వ్యక్తం చేసిన విజిలెన్స్ అధికారులు



సాక్షి

రైతుల కష్టం..

దళారుల భోజ్యం

సాక్షి దినపత్రికలో వచ్చిన కథనం



తూకం వివరాలను తెలుసుకుంటున్న మార్కెటింగ్ డీడీ

సాక్షి ఎఫెక్ట్

మార్టూరు: రైతులను దళారులు మోసం చేస్తున్నారన్న కథనంతో కదిలిన అధికారులు కూరగాయల మార్కెట్‌లో తనిఖీలు నిర్వహించారు. సోమవారం మండల కేంద్రం మార్టూరు జాతీయ రహదారి పక్కన గల కూరగాయల మార్కెట్‌లో మార్కెటింగ్ విజిలెన్స్ అధికారులు మధ్యాహ్నం తనిఖీలు నిర్వహించారు. 'రైతుల కష్టం.. దళారుల భోజ్యం' శీర్షికన ఈనెల 18 వతేదీ 'సాక్షి'లో వచ్చిన కథనానికి స్పందనగా అధికారులు కమీషన్ వ్యాపారులు, రైతులను స్వయంగా విచారించారు. విచారణలో మార్కెట్‌లో రైతులకు జరుగుతున్న అన్యాయం, అక్రమాల డొల్లతనం కనిపించడం గమనార్హం. మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సువర్చల కమిషన్ వ్యాపారుల కాటాలకు సీలు వేయని పరిస్థితిని గమనించి ప్రశ్నించారు. రైతులు తాము వ్యాపారులకు విక్రయించిన కూరగాయలపై 8 శాతం కమీషన్ మినహాయించుకొని తమకు వ్యాపారులు నగదు చెల్లిస్తున్నట్లు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. తూకంలో తారం పేరుతో రెండు నుంచి నాలుగు కిలోల బరువును ప్రతి బస్తాకు తగ్గిస్తున్నట్లు రైతులు ఆమెకు తెలిపారు.

అధికారుల చుట్టూ దళారులే..

రైతులతో డీడీ సువర్చల మాట్లాడే సమయంలో సిండికేట్‌గా ఏర్పడి మార్కెట్లో అరాచకాలు సృష్టిస్తున్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు ఆమెతో కలిసి చుట్టూ వలయంగా ఏర్పడి ఉండటం స్థానికుల విమర్శలకు దారితీసింది. తమ వద్ద కూరగాయలు కొనుగోలు చేసే కమీషన్ వ్యాపారులు అధికారుల చుట్టూ ఉండటం వలన తాము ఆమెకు వాస్తవాలు చెప్పలేకపోయామని విలేకరుల ముందు రైతులు వాపోయారు. విచారణ సమయంలో విలేకరులపై వ్యాపారులు దౌర్జన్యం చేయటం కొసమెరుపు. లైసెన్స్ కలిగిన కమీషన్ వ్యాపారులు రైతుల నుంచి కొనుగోలు చేసిన సరుకుకు అవసరమైన బిల్లులను తమ షాపు పేరుతో ఉన్న లెటర్ ప్యాడ్‌పై కాకుండా తెల్ల కాగితాలపై వివరాలు రాసి ఇవ్వడాన్ని గమనించిన డీడీ ఇదేంటని ప్రశ్నించగా వ్యాపారుల నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. తనిఖీల అనంతరం విలేకరులతో మాట్లాడిన సువర్చల రైతుల నుంచి వివరాలు సేకరించామని తూకంలో బస్తాకు నాలుగు కిలోల వరకు తారం పేరుతో తగ్గించటం, ఎనిమిది శాతం కమీషన్ తీసుకొని వారం రోజుల్లో రైతులకు డబ్బు ఇస్తున్నట్లు, రైతులకు ఇవ్వాల్సిన అధికారిక రసీదులకు బదులు తెల్ల కాగితాలు వినియోగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చినట్లు ఆమె తెలిపారు. కొంతమంది వ్యాపారులు ఎలక్ట్రానిక్ కాటాలకు సీలు లేకుండా కూరగాయలు కాటా వేస్తున్నట్లు ప్రత్యక్షంగా గమనించానని చెప్పారు. సమస్యను నివేదిక రూపంలో మార్కెటింగ్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఝాన్సీ రాణికి పంపించి తగు చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పొదిలి ఏఎంసీ కార్యదర్శి రవిశంకర్ రెడ్డి, దర్శి ఏఎంసీ కార్యదర్శి పి.పద్మ శేఖర్, చీరాల ఏఎంసీ సీనియర్ అసిస్టెంట్ జి.ప్రసాద్, పర్చూరు ఏఎంసీ కార్యదర్శి పాల్గొన్నారు.

సమస్యలను సత్వరం పరిష్కరించండి

జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న జిల్లా జేసీ ప్రఖర్‌జైన్

బాపట్ల: ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం జరిగింది. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు వచ్చి వినతిపత్రాల ద్వారా సమస్యలు విన్నవించారు. తన పరిధిలో ఉన్న వాటిని జేసీ అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామన్నారు. నమోదైన అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలని, అధికారులు నిబద్ధతతో పనిచేయాలని పలు సూచనలు చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో గ్రాడ్యుయేట్ ఎన్నికలు ఉన్నందున ఓటర్ల నమోదు ప్రక్రియ వేగంగా చేపట్టాలన్నారు. అనంతరం అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలైన విద్యార్థినులకు నగదు బహుమతులు పంపిణీ చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, ఆర్డీఓ పి.గ్లోరియా, డెప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మసీదు ప్రాంతంలో మద్యం దుకాణమా?

తొలగించాలని ముస్లిం పెద్దలు, మహిళల ధర్నా



తహసీల్దార్ గోపీకృష్ణకు వినతిపత్రం అందిస్తున్న ముస్లిం మహిళలు, మైనార్టీ నాయకులు

చీరాల టౌన్: ప్రతీరోజు ఐదుసార్లు నమాజు జరిగే మసీదు.. ముస్లింలు అధికంగా నివశించే ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడం దుర్మార్గమని, మసీదు ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే ఊరుకోమని ముస్లింలు, మహిళలు హెచ్చరించారు. బాపట్ల జిల్లా చీరాల మండలం ఈపురుపాలెం నుంచి తోటవారిపాలెం వెళ్లే రోడ్డులోని మసీదు వద్ద మద్యం దుకాణం ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తుండటంతో ఆ ప్రాంతంలోని ముస్లింలు, పెద్ద ఎత్తున మహిళలు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ముస్లిం పెద్దలు, మహిళలు పాల్గొని మద్యం దుకాణం తొలగించాలని నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ కె.గోపీకృష్ణకు వినతిపత్రాన్ని అందించి మద్యం దుకాణం ఏర్పాటు చేయకుండా చూడాలని కోరారు. తోటవారిపాలెం, ఈపురుపాలెం, పిట్టువారిపాలెం, గవినివారిపాలెంకు వెళ్లే గ్రామ ప్రజలు ఈ రోడ్డు నుంచే రాకపోకలు సాగిస్తారన్నారు. ముస్లిం నివాస ప్రాంతం, మసీదుకు దగ్గర్లోనే మద్యం దుకాణం ఏర్పాటు చేయడం వలన మహిళలకు, స్కూలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడతాయన్నారు. మద్యం దుకాణం ఏర్పాటు చేయకుండా చూడాలని తహశీల్దార్‌ను కోరారు. కార్యక్రమంలో పఠాన్ గౌస్, షేక్ మస్తాన్, షేక్ జిలానీ, కరీముల్లా, మునాఫ్, సుభానీ, సయ్యద్ ముతాహర్, అధికసంఖ్యలో ముస్లింలు, మహిళలు పాల్గొన్నారు.

దివ్యం.. స్ఫూర్తిదాయకం

- పుట్టుకతోనే అంధత్వం
- బాగా చదివి మంచిపేరు తెచ్చుకోవాలనే లక్ష్యం
- లక్ష్యానికి తగ్గట్లుగా కష్టపడి రాణింపు
- ఆదర్శంగా నిలుస్తున్న ఉపాధ్యాయుడు నాగాంజినేయులు



విద్యార్థులకు పాఠాలు చెబుతున్న నాగాంజినేయులు

జే.పంగులూరు: 'పిడికిలే బిగించగా చేతిగీత మార్చుకో.. మారిపోని కథలే లేవని గమనించుకో' అన్న సినీకవి రాసిన మాటలను నిజం చేసి చూపించాడు ఓ దివ్యాంగుడు. ఎంత కష్టమైనా పాఠశాలకు వెళ్లాలని, తనను హేళన చేస్తున్న వారి నుంచే మెప్పు పొందాలని నిర్ణయించుకున్నాడు. తను విద్య నేర్చుకొని తనలాంటి వాళ్లకు ఎంతో మందికి విద్య నేర్పించాలని కష్టపడి చది ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సంపాదించి ఎంతో మందికి ఆదర్శనీయుడయ్యాడు జె.పంగులూరు మండలం చిన్నమల్లవరం గ్రామానికి చెందిన నాగాంజినేయులు.

ఒక్కడే సంతానం..

ఉపాధ్యాయుడు నాగాంజనేయులది మండలంలోని చిన్నమల్లవరం గ్రామం. బస్సు సౌకర్యం కూడా లేని గ్రామంలో చిలుకూరి హనుమంతురావు, భాగ్యలక్ష్మిలకు రెండో సంతానంగా పుట్టాడు. నాగాంజనేయులు పుట్టుకతోనే అంధుడు. నాగాంజనేయులు కంటే ముందు పుట్టిన బాబు చనిపోయాడు. అతను కూడా పుట్టుకతో అంధుడు. నాగాంజనేయులు తరువాత పుట్టిన ఆడపిల్ల చనిపోయింది. ఆడపిల్ల పుట్టుకతోనే అనారోగ్యంతో పుట్టింది. దీంతో నాగాంజనేయులు ఒక్కడే సంతానం అయ్యాడు.

విద్యలో చురుగ్గా..

అంధుడైనప్పటికీ తోటి విద్యార్థులతో గ్రామంలోని పాఠశాలకు వెళ్లడం, ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు శ్రద్ధగా వినడం, వాటిని అప్పజెప్పటం చేస్తూ 4వ తరగతి వరకు గ్రామంలోనే చదివాడు. చదువులో విని వెంటనే అప్పచెప్పేవాడు. చుట్టుపక్కల వాళ్లు చులకనగా చూడటం వలన ఎప్పుడు ఇంట్లోనే ఉండేవాడు. 13 ఏళ్ల వరకు ఇంట్లోనే ఉండి టేప్ రికార్డర్‌లో పాఠాలు వింటూ ఎలాగైన బాగా చదువుకోవాలని, సమాజంలో గౌరవంగా బతకాలని నిర్ణయించుకున్నాడు. 13వ సంవత్సరం నెల్లూరులోని విశ్వభారతి అంధుల పాఠశాలలో చేరాడు. అక్కడ బ్రెయిలీ లిపిలో ఒకటో తరగతి నుంచి మూడో తరగతి వరకు చదివాడు. అక్కడ వాతావరణం నచ్చక 16వ ఏట నరసరావుపేటలోని లూథరన్ హైస్కూల్లో ఫర్ ది బ్లైండ్ స్కూల్లో 4వ తరగతిలో చేరాడు. బ్రెయిలీ లిపిలో నిష్ణాతులైన ఉపాధ్యాయుల వద్ద శిక్షణ తీసుకుంటూ పదో తరగతి పూర్తి చేశాడు. అనంతరం ఇంటర్మీడియట్ నర్సారావుపేటలోని ఎస్ఎస్ఎన్ కళాశాలలో చదివాడు. బీఏ కూడా అక్కడే పూర్తి చేశాడు. 2002లో డిగ్రీ పూర్తి చేసిన నాగాంజినేయులు 2005–06 లో ఎడ్‌సెట్ రాసినా సీటు రాలేదు. తరువాత పశ్చిమ గోదావరి జిల్లా నిడదవోలులో సీటు రావటంతో తెలుగు పండిట్ పూర్తి చేసి 2008 డీఎస్సీలో ఉద్యోగం సాధించారు.

క్లుప్తంగా

అంతర్జాతీయ ఆర్ట్ గ్యాలరీకి రత్నబాబు చిత్రాలు ఎంపిక



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఫైన్ ఆర్ట్స్ విభాగ అధ్యాపకుడు బి. జాన్ రత్నబాబు గీసిన చిత్రాలు అంతర్జాతీయ చిత్ర కళా ప్రదర్శనకు ఎంపికయ్యాయి. యూకేకు చెందిన 'సారాస్ ఇంటర్నేషనల్ ఆర్టిస్ట్ ఎంపవర్మెంట్ కలెక్టివ్' పేరుతో ఆర్ట్ ఎగ్జిబిషన్ నవంబర్ 22 నుంచి 25 వరకు జరగనుంది. ఈ ఎగ్జిబిషన్‌కు 10 దేశాల నుంచి 12 మంది ఆర్టిస్టుల చిత్రాలు ఎంపికయ్యాయి. అందులో నాగార్జున విశ్వవిద్యాలయానికి చెందిన జాన్ రత్నబాబు చిత్రాలు కూడా ఉన్నాయి. భారత దేశం నుంచి ఇద్దరు చిత్రకారులకు మాత్రమే ఈ అవకాశం లభించింది. జాన్ రత్నబాబు పంపిన ఐదు చిత్రాలను ఆ గ్యాలరీ ప్రదర్శనలో ఉంచుతారు.. ఈ మేరకు సోమవారం సారాస్ ఆర్ట్ గ్యాలరీ నిర్వాహకులు సారా నుంచి జాన్ రత్నబాబుకు సమాచారం అందింది. విశాఖపట్నంలో ఇటీవల జరిగిన జీ20 సదస్సులో రత్నబాబు ఆధ్వర్యంలో గీసిన చిత్రాలు ప్రత్యేక ప్రశంసలను పొందాయి. ఆయనకు ఇది నాలుగో అంతర్జాతీయ ప్రదర్శన. ఇప్పటి వరకు 150 జాతీయ, అంతర్జాతీయ అవార్డులు అందుకున్నారు. ప్రపంచ ప్రఖ్యాత జర్మనీ మీడియా బిల్డ్ నుంచి క్రియేటివిటీ సర్టిఫికెట్ పొందారు. ఆయనను యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సీహెచ్. స్వరూపరాణి తదితరులు అభినందించారు.

రూ.10 నాణేలు చట్టబద్ధమైనవి

బ్యాంక్ ఆఫ్ బరోడా రీజినల్ మేనేజర్ కిరణ్‌రెడ్డి



కొరిటెపాడు(గుంటూరు): పది రూపాయల నాణేలు చట్టబద్ధమైనవని, రోజువారీ లావాదేవీలకు ఉపయోగించవచ్చని బ్యాంక్ ఆఫ్ బరోడా(బీఓబీ) రీజినల్ మేనేజర్ ఎస్.కె.కిరణ్‌రెడ్డి తెలిపారు. స్థానిక లక్ష్మీపురంలోని బీఓబీ బ్రాంచ్ ఆధ్వర్యంలో రూ. పది నాణేలపై సోమవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. చాలా మందిలో నాణేం చెల్లదన్న అపోహ ఉందని, దాన్ని పోగొట్టేందుకే సదస్సు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పది రూపాలయ నాణేలు 14 రకాలు ఉన్నాయని, వ్యాపారవేత్తలు, నగర ప్రజలు వాటిని వాడుక చేయాలని సూచించారు. ఇందులో భాగంగా రూ.60 వేల విలువ గల నాణేలు వినియోగదారులకు ఎక్స్ఛేంజ్ చేశారు. సదస్సులో బీఓబీ లక్ష్మీపురం బ్రాంచ్ హెడ్ కె.వెంకటరమణరావు, అధికారులు ప్రసన్న, శ్రీనివాసరావు, అశ్వత్థ నారాయణ, ఖాతాదారులు సంజీవరెడ్డి, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

అమరుల త్యాగాలు చిరస్మరణీయం

- జిల్లా ఎస్పీ తుషార్ డూడీ
- ఘనంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం

బాపట్ల: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సోమవారం బాపట్ల పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన పోలీసు అమరవీరుల స్థూపం వద్ద ముఖ్య అతిథి బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడీ పుష్ప గుచ్ఛాలను ఉంచి ఘన నివాళులర్పించారు. అడ్మిన్ ఆర్ఐ షేక్ మౌలుద్దీన్ పెరేడ్ కమాండర్‌గా వ్యవహరిస్తూ ముఖ్య అతిథులకు గౌరవ వందనం సమర్పించి పోలీస్ వాయిద్యాలతో 'స్మృతి పేరేడ్'ను నిర్వహించారు. అమరవీరుల వివరాలతో ఉన్న 'షహీద్ పుస్తక్ టోలి' ని ఆర్ఎస్ఐ ఎన్.గోపి ముఖ్య అతిథికి అందించారు. జిల్లా ఎస్పీ, బాపట్ల శాసనసభ్యుడు వేగేశన నరేంద్ర వర్మ రాజు, అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్, బాపట్ల డీఎస్పీ జి.రామాంజనేయులు, చీరాల డీఎస్పీ పి.జగదీష్ నాయక్, రేపల్లె డీఎస్పీ ఎ.శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ ఎస్.చంద్రమోహన్‌లు పోలీసు అమర వీరుల స్థూపం వద్ద పుష్ప గుచ్ఛాలతో ఘన నివాళులర్పించారు. పోలీస్ అమర వీరులను స్మరించుకుంటూ అతిథులు, సభికులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. 'షహీద్ పుస్తక్ టోలి' లోని అమర వీరుల పేర్లను అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్ చదివి వినిపించారు. ఈ సంవత్సరం దేశ వ్యాప్తంగా 214 మంది తమ ప్రాణాలను కోల్పోయారని వారిలో ఇద్దరు రాష్ట్రానికి చెందినవారు ఉన్నారన్నారు.



బాధిత కుటుంబాలకు జ్ఞాపికలు అందిస్తున్న ఎస్పీ తుషార్ డూడీ, చిత్రంలో ఎమ్మెల్యే నరేంద్ర వర్మరాజు

శాంతిభద్రతల పరిరక్షణకు పునరంకితం..

ఎస్పీ తుషార్ డూడీ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంగా జరుపుకొంటామన్నారు. రాత్రి, పగలు, ఎండ, వాన తేడా లేకుండా 24/7 పనిచేసేది పోలీసు అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, నేరాలను నియంత్రణలో పోలీస్ శాఖ విశేషంగా కృషి చేస్తుందన్నారు. గత నెలలో కృష్ణా నది వరద ఉధృతికి జిల్లాలోని లంక గ్రామాలు ముంపునకు గురైనప్పుడు ఎటువంటి ప్రాణనష్టం సంభవించకుండా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో పోలీసులు విశేషంగా కృషిచేశారన్నారు. జిల్లావ్యాప్తంగా అక్టోబర్ 21 నుంచి 31వ తేదీ వరకు పోలీస్ అమర వీరుల సంస్మరణ వారోత్సవాలు నిర్వహించనున్నామన్నారు. బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు మాట్లాడారు. అనంతరం అమరులకు జోహార్లు అర్పిస్తూ, నినాదాలు చేసుకుంటూ బాపట్ల పట్టణ పోలీస్ స్టేషన్ నుంచి భావనారాయణ స్వామి గుడి మీదుగా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం వద్దకు వెళ్లి మానవహారంగా ఏర్పడి 'అమరవీరులకు జోహార్లు' అంటూ నినాదాలు చేశారు. అక్కడ నుంచి గడియార స్థంభం సెంటర్, పాతబస్టాండ్ మీదుగా స్టేషన్‌కు చేరుకున్నారు.



బాపట్లలో మానవహారం చేపట్టిన విద్యార్థులు



ర్యాలీలో పాల్గొన్న పోలీసులు

సమైక్యత, సమగ్రతకు యువత పాటుపడాలి

ఏఎన్‌యూ: జాతీయ సమైక్యత, సమగ్రతకు యువత ప్రత్యేకంగా పాటుపడాలని ఏఎన్‌యూ వీసీ ఆచార్య కె. గంగాధరరావు పిలుపునిచ్చారు. భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు , క్రీడా మంత్రిత్వ శాఖ,గుంటూరు నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఆరు రోజులపాటు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నిర్వహిస్తున్న 4వ కాశ్మీర్ యూత్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమాన్ని వీసీ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ జాతీయ సమగ్రత పెంపొందించడంలో యువతదే కీలకపాత్ర అన్నారు. దేశంలోని సాంస్కృతిక, పారిశ్రామిక, చారిత్రక, పర్యాటక విద్యాపరమైన ప్రముఖ ప్రదేశాలను సందర్శించే అవకాశం ఈ యువ సమ్మేళనం వల్ల కలుగుతుందని తెలిపారు. నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంచాలకులు అంశుమాన్ ప్రసాద్ దాస్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా కాశ్మీర్ యువతలో జాతీయ ఐక్యత, సమగ్రతను పెంపొందించే లక్ష్యంతో యువ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కాశ్మీరీ యువతకు ఇక్కడి సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, ఆహారపు అలవాట్లు, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు గురించి యువ సమ్మేళనంలో వివరిస్తారని తెలిపారు. నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి కిరణ్మయి మాట్లాడుతూ వివిధ అంశాలపై వర్క్‌షాప్‌లతోపాటు రెండు రోజుల క్షేత్ర స్థాయి సందర్శనలతో కార్యక్రమం జరగనుందని వివరించారు. ఏఎన్‌యూ రెక్టార్ ఆచార్య కె. రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం, ఓఎస్‌డీ ఆచార్య ఆర్‌వీఎస్ఎస్ఎన్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పోటీల్లో మూడోస్థానం

వేమూరు: రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పోటీల్లో పెరవలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మూడో స్థానం సాధించడం జరిగిందని వ్యాయామ ఉపాధ్యాయుడు బుచ్చిరెడ్డి తెలిపారు. ఈ నెల 19, 21వ తేదీల్లో అనంతపురం జిల్లా నార్పల శ్రీ నేతాజీ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ 43వ సీనియర్ మెన్, ఉమెన్ షూటింగ్ బాల్ రాష్ట్రస్థాయి పోటీలు సోమవారం జరిగాయి. ఈ పోటీల్లో రాష్ట్రంలోని 18 జిల్లాల క్రీడాకారులు పాల్గొన్నారు. వేమూరు నియోజక వర్గంలోని పెరవలి జిల్లా పరిషత ఉన్నత పాఠశాల క్రీడాకారులు విశాఖపట్నం క్రీడాకారులపై 2-0 తేడాతో విజయం సాధించి మూడవ స్థానం కైవసం చేసుకున్నారని ఆయన తెలిపారు. క్రీడకారులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు తుమ్మ శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మ బుచ్చిరెడ్డి, జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఇస్తర్ల బాబురావు, సెక్రెటరీ పిల్లి సురేంద్ర పాల్గొన్నారు.



మూడోస్థానం సాధించిన పెరవలి పాఠశాల క్రీడాకారులు

నేటి నుంచి తైక్వాండో జట్ల ఎంపిక

వేటపాలెం: సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో మంగళవారం నుంచి కాకినాడ జేఎన్టీయూ ఆధ్వర్యంలో తైక్వాండో యూనివర్సిటీ టీం సెలక్షన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ ఎస్.లక్ష్మణరావు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కె.జగదీష్‌బాబు మాట్లాడుతూ జేఎన్టీయూ పరిధిలోని అన్నిజిల్లాల కళాశాలల నుంచి యూనివర్సిటీ టీం కోసం సెలక్షన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలకు దూరప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు కళాశాలలో వసతి సౌకర్యం కల్పిస్తున్నామని పీఈటీ అన్నం శ్రీనివాసరావు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు తప్పనిసరిగా యూనివర్సిటీ ఫార్మట్‌లో ఎలిజబిలిటీ ఫామ్‌తో పాటు కళాశాల ఐడీ కార్డు తీసుకురావాలని సూచించారు.



మాట్లాడుతున్న పీఈటీ శ్రీనివాసరావు

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

జిల్లా ఎస్పీ తుషార్ డూడీ

బాపట్ల: ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోమని జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ సిబ్బందిని హెచ్చరించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఎస్పీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు వారి సమస్యలను స్వయంగా ఎస్పీకి విన్నవించుకుని, రాతపూర్వకమైన అర్జీలను అందజేశారు. సమస్యలను విని, అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత పోలీస్ అధికారులకు ఫోన్ చేసి చట్ట పరిధిలో విచారించి త్వరితగతన అర్జీలను పరిష్కరించాలని ఎస్పీ ఆదేశించారు. భూవివాదాలు, కుటుంబ కలహాలు, ఆర్థిక లావాదేవీల మోసాలు వంటి పలు సమస్యలపై 39 మంది ఫిర్యాదుదారులు వారి సమస్యలను విన్నవించుకున్నారు.



బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ తుషార్ డూడీ

ఈ సందర్భంగా ఎస్పీ తుషార్ డూడీ మాట్లాడుతూ ప్రజాసమస్యలు పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులను చట్ట పరిధిలో త్వరిత గతిన విచారించి నిర్దిష్ట గడువులోగా పరిష్కరిస్తామన్నారు. మహిళ సంబంధిత ఫిర్యాదులపై పోలీసు అధికారులు వేగంగా స్పందించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. పోలీస్ స్టేషన్లకు వివిధ సమస్యల పరిష్కారం కోసం వచ్చే ఫిర్యాదుదారులపై మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, సహృదయ భావనతో ఫిర్యాదుదారుల సమస్యలను అడిగి తెలుసుకొని వాటిపై చట్టపరిధిలో చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు. చీరాల డీఎస్పీ పి.జగదీష్ నాయక్, సీఐ యు.శ్రీనివాసులు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

6న స్వర్ణకార సంఘానికి ఎన్నికలు

నెహ్రూనగర్: గుంటూరు జిల్లా స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో పట్టణ సంఘం ఎన్నికలు నవంబర్ 6న నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్ తెలిపారు. గత 20 రోజులుగా పట్టణ స్వర్ణకారుల ఓటు నమోదు ప్రక్రియ చేపట్టామని, ఇందులో భాగంగా ఇద్దరు ఎన్నికల బరిలో ఉన్నట్లు చెప్పారు.

చదువుతోపాటు క్రీడలూ ముఖ్యమే

- ఆంధ్రకేసరి యూనివర్సిటీ ప్రిన్సిపాల్ రాజమోహన్
- యూనివర్సిటీ షటిల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు ప్రారంభం

చీరాల రూరల్: విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలూ ముఖ్యమని.. క్రీడల్లో రాణించినవారు ఉన్నత స్థానాల్లో ఉంటారని ఒంగోలు ఆంధ్రకేసరి యూనివర్సిటీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజమోహన్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక కొత్తపేటలోని రావి జయలక్ష్మి, సుబ్బారాయుడు ఇండోర్ స్టేడియంలో యూనివర్సిటీ పరిధిలో ఇంటర్ కాలేజియేట్ షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ఎంపిక నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని పోటీలు ప్రారంభించారు. పోటీల్లో యూనివర్సిటీ పరిధిలోని 30 కళాశాలల నుంచి 32 జట్లకు చెందిన క్రీడాకారులు పాల్గొని తమ క్రీడా పటిమను ప్రదర్శించారు. క్రీడాకారులు పోటాపోటీగా తలపడ్డారు. పోటీలలో పాల్గొన్న జట్ల నుంచి అత్యుత్తమంగా రాణించిన ఎనిమిది మందిని ఎంపిక చేశారు. సౌత్‌జోన్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు చెన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఈనెల 25 నుంచి 29 వరకు జరిగే పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో బీబీహెచ్ విద్యాసంస్థల వైస్ ప్రెసిడెంట్ కె.ఏకాంబరేశ్వరబాబు, సెక్రటరీ, కరస్పాండెంట్ సీహెచ్ వాసుదేవరావు, యూనివర్సిటీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఐ.దేవివరప్రసాద్, సెలక్షన్ కమిటీ మెంబర్ జి.సాయి సురేష్, బీబీహెచ్ డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్ జి.ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభిస్తున్న ఏకేయూ ప్రిన్సిపాల్ రాజమోహన్

వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై టీడీపీ నేతల దాడి

తీవ్రంగా కొట్టి కిడ్నాప్‌కు యత్నం

కర్లపాలెం: బాపట్ల జిల్లా కర్లపాలెం మండలంలోని పెదగొల్లపాలెంలో ఆదివారం రాత్రి వైఎస్సార్ సీపీ వర్గీయులపై దాడిచేసిన టీడీపీ నేతలు వారిని కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించారు. బాధితులు తెలిపిన మేరకు.. పెదగొల్లపాలెంలో ఆదివారం రాత్రి ఒక వివాహానికి హాజరైన వారితో తెలుగుదేశం నాయకుడు పమిడి శ్రీనివాసరావు, అతడి కుమారుడు పమిడి గోపి రోడ్డుపై మాట్లాడసాగారు. అదే సమయంలో బైక్ మీద వచ్చిన వైఎస్సార్ సీపీకి చెందిన నర్రా నాగేంద్రబాబు, నర్రా సునీల్ సైడ్ ఇవ్వమని హారన్ వేశారు. దీంతో పమిడి శ్రీనివాసరావు, పమిడి గోపి, హనుమంతు ఒక్కసారిగా దుర్భాషలాడుతూ బైక్‌పై ఉన్న నాగేంద్రబాబును, సునీల్‌ను కొట్టి గాయపరిచారు. తరువాత వారిద్దరిని బలవంతంగా కారులో ఎక్కించుకుని తీసుకెళ్లసాగారు. దీన్ని గమనించిన సర్పంచ్ యల్లావుల సురేష్ యాదవ్, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు స్కూటీపై వెంబడించారు. దీంతో టీడీపీ వర్గీయులు కర్లపాలెం పోలీస్‌స్టేషన్ ముందు కారు ఆపి నాగేంద్రబాబును, సునీల్‌ను దించి పరారయ్యారు. పోలీసుల సూచన మేరకు గాయపడిన వారిని బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. దాడి చేసిన పమిడి గోపి.. 'నేను ఎంపీ మనిషిని. నన్నెవరూ ఏమీ చేయలేరు..' అని బెదిరించారని బాధితులు తెలిపారు. వైఎస్సార్ సీపీ వర్గీయుల్ని కొట్టి గాయపరిచిన టీడీపీ వారిపై కేసు నమోదుచేసి కఠినంగా శిక్షించాలని, తమకు రక్షణ కల్పించాలని బాధితుల బంధువులు, సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకులు కోరారు.



గాయపడిన నర్రా నాగేంద్రబాబు, నర్రా సునీల్

పరస్పరం ఫిర్యాదులు..

పెదగొల్లపాలెంలో ఆదివారం నర్రా నాగేంద్రబాబు, సునీల్ తనపై దాడిచేశారని పమిడి శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని కర్లపాలెం ఎస్ఐ ఎస్.రవీంద్ర తెలిపారు. అలాగే పమిడి శ్రీనివాసరావు, పమిడి గోపి, హనుమంతు తనపై దాడి చేశారని నర్రా నాగేంద్రబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

కార్యకర్తల జోలికొస్తే సహించేది లేదు

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున

బాపట్ల: పార్టీ కార్యకర్తల జోలికి వస్తే సహించేదిలేదని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున హెచ్చరించారు. నియోజకవర్గంలోని పెద్దగొల్లపాలెంలో వైఎస్సార్ సీపీ నాయకులు నాగేంద్ర, సునీల్‌పై టీడీపీ నాయకులు దాడి చేయటాన్ని తీవ్రంగా ఖండించారు. బాపట్ల ఏరియా వైద్యశాల్లో చికిత్సపొందుతున్నవారిని ఆయన పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి, నాయకులు ఉన్నారు.



గాయపడిన కార్యకర్తలను పరామర్శిస్తున్న మేరుగ నాగార్జున, కోన రఘుపతి

చోరీ కేసులో పని మనిషి అరెస్టు

- రూ. 37లక్షలు అపహరణ
- కేసు ఛేదించిన రూరల్ పోలీసులు

మంగళగిరి: మండలంలోని ఆత్మకూరు జాతీయ రహదారి వెంట ఉన్న మిడ్ వ్యాలీ సిటీలో జరిగిన చోరీని రూరల్ పోలీసులు ఛేదించారు. సీఐ వై. శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు.. మిడ్ వ్యాలీ సిటీలోని డాక్టర్ ఇంట్లో ఓ మహిళ పని మనిషిగా చేరింది. నాలుగు నెలలుగా విడతల వారీగా రూ. 37లక్షలు చోరీ చేసింది. ఇటీవల నగదుతో డైమండ్ నల్లపూసల గొలుసు చోరికి గురికాగా యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు. పని మనిషిపై అనుమానంతో విచారించగా అసలు విషయం బయటపడిందని తెలిపారు. ఆమెను అరెస్ట్ చేసి నగదు, డైమండ్ గొలుసు స్వాధీనం చేసుకుని యజమానికి అప్పగించినట్లు సీఐ చెప్పారు.



వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ శ్రీనివాసరావు

అనుమానాస్పద మృతిపై కేసు

మార్టూరు: కుటుంబానికి దూరంగా ఉంటున్న ఓ వ్యక్తి మృతిపై అనుమానాస్పద కేసుగా పోలీసులు నమోదు చేశారు. ఏఎస్ఐ మహబూబ్ బాషా వివరాల మేరకు.. మండలంలోని ద్రోణాదుల గ్రామానికి చెందిన కాళహస్తి రాఘవేంద్రరావు (43)కు చాలాకాలం క్రితం హైదరాబాద్‌కు చెందిన ఓ యువతితో వివాహం జరిగింది. భార్యాభర్తల మధ్య విభేదాల కారణంగా రాఘవేంద్రరావు అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె మండలం చెన్నంపల్లి గ్రామానికి చెందిన చంద్రకళను 2004 సెప్టెంబర్ నెలలో వివాహం చేసుకొని అక్కడే ఉంటున్నాడు. వీరికి 13 ఏళ్ల నిహారిక, 11 ఏళ్ల గగన అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇటీవల కామెర్ల వ్యాధితో బాధపడుతున్న రాఘవేంద్రరావు ఆరోగ్యం విషమించి ఆదివారం చిన్నంపల్లిలో మరణించాడు. ఈ క్రమంలో రాఘవేంద్రరావు మృతదేహాన్ని భార్య చంద్రకళ ఆయన స్వగ్రామం ద్రోణాదులకు ఆదివారం రాత్రి తీసుకువచ్చింది. మృతుడి తల్లి, సోదరుడు వీరిని ఆదరించకపోవడంతో చంద్రకళ భర్త మృతదేహాన్ని సోమవారం ఉదయం మార్టూరు శ్మశాన వాటికకు తరలించి పోలీస్ స్టేషన్‌లో విషయం తెలియజేసింది. మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదుపై అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. అనంతరం పోలీసులు రాఘవేంద్రరావు మృతదేహానికి మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రిలో శవ పంచనామా చేయించి భార్య చంద్రకళకు అప్పగించారు. సోమవారం సాయంత్రం రాఘవేంద్రరావు పెద్ద కుమార్తె నీహారిక తన తండ్రికి మార్టూరు శ్మశాన వాటికలో అంతిమ సంస్కారాలు నిర్వహించటంతో సమస్య సద్దుమణిగింది.

ప్రియుడి కత్తిపోట్లకు మహిళ బలి

బాపట్ల జిల్లాలో దారుణం

మార్టూరు: సహజీవనం చేస్తున్న వ్యక్తి కత్తితో పొడవడంతో ఒక మహిళ ప్రాణాలు కోల్పోయింది. బాపట్ల జిల్లా మార్టూరు మండలం దేగరమూడి గ్రామంలో ఆదివారం రాత్రి ఈ దారుణం జరిగింది. సీఐ మద్దినేని శేషగిరిరావు తెలిపిన వివరాల మేరకు..మండలంలోని రాజుపాలెం గ్రామానికి చెందిన సూరేపల్లి మేరీ (27) భర్తతో విడిపోయి తండ్రి నాగరాజు వద్ద ఉంటోంది. ఆమెకు ఇద్దరు పిల్లలు. ఈ క్రమంలో మేరీ పొగాకు కూలి పనుల కోసం తల్లిదండ్రులతో కలిసి నెల్లూరు జిల్లా డీసీ పల్లి వెళ్లింది. అక్కడ ఆమెకు కొరిశపాడు మండలం ఎర్రబాలెం గ్రామానికి చెందిన కందే ప్రసాద్‌తో పరిచయమై వివాహేతర సంబంధానికి దారితీసింది. ఇద్దరూ ఒక ఏడాది పాటు వేరే ప్రాంతానికి వెళ్లి సహజీవనం చేశారు. ఇటీవల తన తండ్రి నాగరాజు అనారోగ్యానికి గురికావడంతో 20 రోజుల కిందట మేరీ మార్టూరు మండలం దేగరమూడిలో ఉంటున్న తండ్రి వద్దకు వచ్చింది. ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో దేగరమూడి వచ్చిన కందే ప్రసాదు తనతో రావాలని మేరీతో ఘర్షణ పడ్డాడు. ఈ క్రమంలో కత్తితో మేరీ మెడ, మొహం, వీపు, ఛాతీపై పొడిచాడు. అడ్డుపెట్టిన చేతులకు కూడా తీవ్రగాయాలయ్యాయి. తీవ్ర రక్తస్రావంతో అపస్మారకస్థితిలో ఉన్న మేరీని స్థానికులు 108 వాహనం ద్వారా గుంటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మేరీ సోమవారం తెల్లవారుజామున మృతి చెందింది. మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు. కత్తితో సహా పరారైన కందే ప్రసాద్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.